ఎస్సారెస్పీలోకి 3183క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర, జూలై 14: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతోపాటు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 3183క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1062.20అడుగులు (12.788టీఎంసీ) నీటి నిల్వ ఉందని, గతసంవత్సరం ఇదే రోజు 1067.00 అడుగులు (18.718టీఎంసీ)ల నీటి నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఏడు టీఎంసీల నీరు వచ్చి చేరిందని ఈఈ తెలిపారు.



రైతు భరోసాపై భిన్నాభిప్రాయాలు!

- సాగు భూములకే ఇవ్వాలని రైతుల వినతి
- ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు ఇవ్వొద్దని సూచన
- ప్రభుత్వానికి నివేదించిన సహకార శాఖ అధికారులు
- ఈనెల 18న జిల్లాకు రానున్న మంత్రుల కమిటీ

సాగు చేసే వారందరికీ పథకం అమలు చేయాలి..
: ఎడ్డడి హన్మాండ్లు, కోటగిరి



సాగు చేసే రైతులందరికీ రైతుభరోసాను ఇవ్వాలి. పంటలు వేస్తున్నందున త్వరగా రైతుభరోసాను అమలు చేయాలి. పెట్టుబడి కోసం గత ప్రభుత్వం లాగానే రైతుభరోసాను విడుదల చేయాలి. ప్రభుత్వం భరోసా కింద డబ్బులను విడుదల చేస్తే మేలు జరుగుతుంది.

కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలి..
: ఇందూరు పోశెట్టి, కౌలురైతు



తమకు సాగు భూమి లేక కౌలుకు తీసుకొని పంటలు వేస్తున్నాం. ప్రభుత్వం తమను గుర్తించి రైతుభరోసాను ఇవ్వాలి. ఎకరాలకు ఎకరాలు కౌలు తీసుకొని పంటలు పండించినా.. భరోసా రాకపోవడం వల్ల కౌలు రైతులకు అన్యాయం జరుగుతుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం కౌలు రైతులకు కూడా అమలు చేయాలి.

పంట వేయని భూములకు భరోసా ఇవ్వొద్దు..
: రాంచందర్, నందిపేట్



పంట వేయని భూములకు సాగు చేయకుండా వదిలి వేసిన భూములకు, రియల్ ఎస్టేట్ భూములకు రైతుభరోసాను అమలు చేయవద్దు. ప్రభుత్వ ఉద్యోగుల భూములకు కూడా ఇవ్వద్దు. సాగు చేసే ప్రతి రైతుకు భరోసాను అందించాలి. పంట వేసే సమయంలోనే రైతుభరోసాను రైతుల ఖాతాల్లో జమ చేయాలి.

నిజామాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు భరోసా పథకం అమలు తీరుపై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సాగుభూములకే ఇవ్వాలని.. రైతులందరికీ వర్తింపజేయాలని సభల్లో మెజార్టీ రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు రైతుబంధును వర్తింపజేయవద్దని విజ్ఞప్తి చేశారు. గతంలో రైతుబంధు అమలు విధంగానే బీడు భూములు, సాగు చేయని భూములను మినహాయించి రైతుభరోసాను అమలు చేయాలని కోరారు. కౌలు రైతులు తమకు కూడా రైతుభరోసాను ఇవ్వాలని కోరగా భూములిచ్చే రైతులు మాత్రం తాము ధ్రువీకరించలేమని వారు అధికారులకు తేల్చిచెప్పారు. రైతుభరోసాను ప్రభుత్వ ఉద్యోగులకు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వర్తింపజేయవద్దని కోరారు. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించిన సహకార శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మరోదఫా రైతుల నుంచి వివరాలు తెలుసుకునేందుకు ఈనెల 18న మంత్రుల సబ్‌కమిటీ జిల్లాకు రానుంది. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు రైతు సంఘాల నేతలు, రైతులతో సమావేశం నిర్వహించి మరోసారి అభిప్రాయాన్ని తెలుసుకోనున్నారు.



ఇందల్‌వాయిలో ఏర్పాటు చేసిన మహాసభలో మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్‌రావు, పాల్గొన్న రైతులు (ఫైల్)

వానాకాలం సీజన్‌లో అమలుకు నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు తరహాలోనే రైతుభరోసాను ఈ వానాకాలం నుంచే అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తి చేసిన తర్వాత రైతుభరోసా అమలుపై విధివిధానాలను ప్రకటించనుంది. ఎకరాకు 7,500 చొప్పున సంవత్సరానికి 15వేల రూపాయలను పెట్టుబడి రూపంలో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా రైతుభరోసాను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ భరోసా కోసం అన్ని జిల్లాల పరిధిలో గత నెల 28 నుంచి ఈనెల 4 వరకు రైతుల నుంచి అభిప్రాయ సేకరణ అధికారులు చేశారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న 89 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో సమావేశాలను నిర్వహించారు. ఈ రైతు సమావేశాల్లో ప్రతి సంఘం పరిధిలో వంద మందికి తక్కువకాకుండా రైతులు హాజరయ్యే విధంగా చూశారు. ఈ రైతుల నుంచి రైతుభరోసా అమలుపై పూర్తిస్థాయిలో వివరాలను సేకరించారు. రైతులతో పాటు రైతుసంఘాల నేతలు, ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాల డైరెక్టర్లు, చైర్మన్లు వ్యక్తపర్చిన అభిప్రాయాలను క్రోడీకరించారు. ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా రైతుల అభిప్రాయాలను రైతుభరోసాపై నివేదిక రూపంలో పంపించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ సభల్లో ఎక్కువ మంది హాజరయ్యే విధంగా చూడటంతో పాటు ప్రతి సొసైటీ సమావేశాలను మినిట్స్‌లో నమోదు చేయడంతో పాటు వాటి సారంశాన్ని ఈ నివేదికలో పొందుపర్చారు.

సాగుభూములకే ఇవ్వాలంటున్న రైతులు

రైతుభరోసా అమలుపై జిల్లాలోని రైతులు ఎక్కువ మొత్తంలో సాగు భూములకే ఇవ్వాలని సమావేశంలో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా కాకుండా పంటలు వేసే భూములకు ఇస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం వద్ద వివరాలు ఉన్నందున రైతువారిగా వివరాలు సేకరించే బదులు పంట విస్తీర్ణంకు అనుగుణంగా పరిశీలించి ఇవ్వాలని సమావేశంలో రైతులు తమ ఫీడ్ బ్యాక్‌ను సహకార శాఖ అధికారులకు అందించారు. సాగు భూమి ఎంత ఉన్న రైతుభరోసా ఇవ్వాలని కొంత మంది రైతులు కోరగా మరికొంత మంది రైతులు పది ఎకరాల వరకు సీలింగ్ విధించి రైతుభరోసాను అమలు చేయాలని కోరారు. ఈ సీలింగ్ ప్రకారం రైతులే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఎవరున్నా ఇవ్వాలని కొంత మంది రైతులు వ్యక్తపర్చగా మరికొంత మంది రైతులు ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవద్దని కోరారు. రైతులకు తప్ప ఎవరికి ఇవ్వవద్దని వారు అధికారులకు విన్నవించారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల భూములను మినహాయించి సాగు భూములకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు రైతుభరోసా అమలు చేయవద్దన్నారు. మరికొంత రైతులు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్లకు కూడా ఇవ్వవద్దని అధికారులకు వివరించారు. మరికొంత మంది రైతులు గత ప్రభుత్వం లాగానే ఇవ్వాలని అధికారులకు వివరించారు. కౌలు రైతుల విషయంలో మాత్రం మెజార్టీ రైతులు వ్యతిరేకంగానే అధికారులకు వివరించారు. కౌలు రైతులను ప్రభుత్వమే గుర్తించాలని తమ భూముల్లో సాగు చేస్తున్నట్లు ధ్రువీకరణ ఇవ్వలేమని వారు తెలిపారు. తమ భూములకు సంబంధించి రైతుభరోసా తమకే ఇవ్వాలని రైతులు సహకార శాఖ అధికారులకు విన్నవించారు. కౌలు రైతులపై అందరూ రైతులు ఒకేవిధంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కౌలు రైతులు మాత్రం గత వైఎస్ ప్రభుత్వం లాగా గుర్తింపు కార్డులను ఇవ్వాలని వారు కోరారు. రుణాలతో పాటు సబ్సిడీలను కూడా తమకు అనుకూలంగా ఉండే విధంగా చూడాలని సహకార శాఖ అధికారులకు వివరించారు. మెజార్టీ రైతులు రైతుభరోసా అందరికి ఇవ్వాలని కోరడంతో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా వారు నివేదికలో పొందుపర్చి ప్రభుత్వానికి పంపించారు.

జిల్లాలో పర్యటించనున్న కేబినెట్ సబ్ కమిటీ

రైతుభరోసాపై ఇప్పటికే సహకార శాఖ అధికారులు వివరాలను తీసుకొని ప్రభుత్వానికి నివేదించగా ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ కూడా ఉమ్మడి జిల్లాలో పర్యటించనుంది. రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. కమిటీ సభ్యులు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు అధికారులు ఈనెల 18న జిల్లాకు రానున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో రైతుల నుంచి రైతుభరోసాపై అభిప్రాయాలను తీసుకోనున్నారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు రైతుసంఘాల నేతలను కూడా ఆహ్వానించి మంత్రుల కమిటీ అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఈ కమిటీ ఇచ్చే నివేదికకు అనుగుణంగానే ప్రభుత్వం రైతుభరోసాపై నిర్ణయం తీసుకొని అమలు చేయనుంది.



జిల్లాలో మోస్తరు వర్షాలు

జిల్లాలో ఇప్పటి వరకు కురిసిన 226.4 మి.మీ వర్షం

- ఇంకా సరాసరి నమోదుకాని సగటు వర్షపాతం
- జిల్లాలో పెరుగుతున్న పంటల సాగు విస్తీర్ణం

నిజామాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు మాత్రం ఇప్పటి వరకు జిల్లాలో పడలేదు. గడిచిన రెండు రోజులుగా పలు మండలాల పరిధిలో జల్లులతో కూడిన వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో జూన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 265.8 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా ఇప్పటి వరకు 226.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. చెదురు ముదురుగా వర్షాలు కురుస్తున్నా.. జిల్లాలో సాధారణ సగటు వర్షపాతం ఇంకా నమోదు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 33 మండలాలు ఉండగా రెండు మండలాల పరిధిలోనే సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలో 16 మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం నమోదు కాగా 15 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం పడింది.

జిల్లాలో పెరుగుతున్న సాగు..

జిల్లాలో జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు పడుతుండటంతో పంటల సాగు పెరుగుతోంది. ఆరుతడి పంటలతో పాటు వరిసాగు కూడా ఎక్కువగా జరుగుతోంది. అదను దాటుతుండటంతో రైతులు ఎక్కువగా బోర్లను ఉపయోగించి పంటలను వేస్తున్నారు. నిజాంసాగర్ నీటిని కూడా విడుదల చేయడంతో వరినాట్లను ఎక్కువగా వేస్తున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం వానాకాలంలో 5లక్షల 52వేల 128 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 3లక్షల 29వేల 161 ఎకరాల్లో పంటలను వేశారు. జిల్లాలో ఈ వానాకాలంలో 4లక్షల 30వేల 550 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు లక్షా 79వేల 828 ఎకరాల్లో వరిపంట వేశారు. వర్షాలు తక్కువ పడిన నిజాంసాగర్ నీటిని విడుదల చేస్తుండటంతో బోధన్ డివిజన్ పరిధిలోని రైతులు అలిసాగర్ వరకు ఈ నీటిని వినియోగించి వరినాట్లు వేశారు. మరికొంత మంది రైతులు నాట్లను కొన సాగిస్తున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో బోర్లను వినియోగించి రైతులు ఈ వరినాట్లను కొనసాగిస్తున్నారు. సమయం దగ్గర పడుతుండటం గడువులోపు నాట్లు వేయాల్సి ఉండటంతో ఎక్కువ మంది రైతులు వరినాట్లు కొనసాగిస్తున్నారు. నాట్లు కొనసాగుతుండగా జిల్లాలో ఇప్పటి వరకు 41వేల 374 ఎకరాల్లో మొక్కజొన్న, 34వేల 238 ఎకరాల్లో సోయా బీన్, 24వేల ఎకరాల్లో పసుపును సాగు చేశారు. ఇవే కాకుండా కందులు, మినుములు, పెసరతో పాటు ఇతర పంటలను రైతులు వేస్తున్నారు. భారీ వర్షాలు పడితే పెద్ద మొత్తంలో వరినాట్లను రైతులు వేయనున్నారు.

బోధన్ జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు

- ప్రారంభించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు ఆదేశం



ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బోధన్‌రూరల్, జూలై 14: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చిన ఉచిత డయాలసిస్ సేవల విభాగాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ప్రారంభించారు. డయాలసిస్ విభాగం ద్వారా రోగులకు అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున 20 మంది వరకు డయాలసిస్ సేవలు వినియోగించుకోవచ్చునని వైద్యులు తెలిపారు. చుట్టు పక్కల మండలాల నుంచి డయాలసిస్ పేషెంట్లు ఇక్కడికి వస్తారని ఏకకాలంలో ఏడుగురికి చొప్పున రోగులకు డయాలసిస్ చేయవచ్చని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. ఆసుపత్రిలోని ఆర్వో ప్లాంట్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఇతర విభాగాలను కలెక్టర్ సందర్శించి స్థానికంగా గల సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్‌లను పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. వైద్యుల కొరత ఉన్నట్లయితే కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. వైద్యులు, సిబ్బంది అందరు సమయ పాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువగా ఆస్కారం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ కే. గంగాధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ శంకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, ఆర్ఎంవో డాక్టర్ అబ్దుల్ రహీంలతో వైద్య సిబ్బంది తదితరులున్నారు.

బీసీలకు దూరమైనందునే కేంద్రంలో
బీజేపీకి పూర్తి మెజార్టీ రాలేదు

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరచి కులగణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ కులగణన చేయాలి



టీఎన్‌జీవోస్ భవన్‌లో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్

నిజామాబాద్ అర్బన్, జూలై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ కులగణన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమగ్ర కుల గణన సాధన యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీలకు దూరమైనందునే కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజార్టీ రాలేదని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరచి కులగణన చేయాలని లేకపోతే మరో మండల్ పోరాటం తప్పదన్నారు. బీసీలకు అడ్డు వచ్చే వారిని గద్దెదింపక తప్పదని ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలే బీసీల ఐక్యతకు నిదర్శనమన్నారు. బీసీల లెక్కలు తీస్తే జాతీయ సమగ్రతకు లాభమే తప్ప.. ఎలాంటి నష్టం ఉండదని భాషా పరమైన లెక్కలు, జాతుల పరమైన లెక్కలు ఉన్నప్పుడు బీసీల లెక్కలు ఎందుకు ఉండవని ఆయన అన్నారు. అంతకు ముందు దివంగత నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేష్‌చారి, రాష్ట్ర అధ్యక్షుడు రవి కృష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్, శ్యామ్‌కుమార్, తాటికొండ విక్రమ్ గౌడ్, వేముల వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్, గంగాకిషన్, కరిపె రవీందర్, మాడవేడి వినోద్‌కుమార్, కొయ్యాడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో మహాలక్ష్మికి జలాభిషేకం

ముప్కాల్, జూలై14: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి. కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మికి జలాభిషేకం చేశారు. ఉదయం గోదావరి నుంచి జలాలను తీసుకువచ్చి గ్రామ పొలిమేరల నుంచి డప్పువాయిద్యాలు, వలగొడుగులతో గ్రామవీదులగుండ ఊరేగింపుగా తీసుకువచ్చి మహాలక్ష్మికి జలాభిషేకం చేశారు. అనంతరం మహాలక్ష్మీదేవికి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని అన్నారు.

ముప్కాల్‌లో స్వచ్ఛత పక్వాడ్

ముప్కాల్, జూలై14: ఈనెల 1నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా భారతీయ పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో పరిసరల పరిశుభ్ర చేట్టారు. ఆదివారం ముప్కాల్ బస్టాండ్ ప్రాంతంలో భారత్ పెట్రోలియం సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు పరిసరాల్లోని చెత్తను తొలగించారు.

'మురికి కాలువలతో సమస్యలు తలెత్తకుండా చూడాలి'

మెండోర, జూలై14: రానున్న వర్షాకాలంలో ప్రజలకు మురికికాలువలతో సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు ముత్యాల సునీల్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో మురికికాలువలను కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న మురికికాలువల నిర్మాణాల సమస్యలపై సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రానున్న రోజుల్లో వర్షాలు పడి మురికి కాలువల సమస్య లేకుండా చూడాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, సామ నరేష్, లింగారెడ్డి, గంగారెడ్డి, బాస్కర్, సాయరెడ్డి, రమేష్, మహేష్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోటగిరి, జూలై14: కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో గుమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనాథ ఆశ్రమంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎర్రగడ్డ ఈఎస్ఐ హాస్పటల్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ జ్ఞాపూర్వ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి యోగక్షేమాలను వాకబు చేసి తనవంతు సహాయంగా 30వేల విరాళం అందజేశారు. రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ సంజయ్ శివరాం విద్యార్థులతో మాట్లాడారు. ఆర్మీలో ఎంపిక ప్రక్రియ, క్రమశిక్షణపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీధర్, ఇన్‌చార్జి మధు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో సందడిగా మారిన శ్రీరాంసాగర్

మెండోర, జూలై 14 : ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. దీంతో ప్రాజెక్టులో వరదనీరు చేరుతుండడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుంది. దీంతో సుమారు ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రాజెక్టును సందర్శించడానికి తండోపతండాలుగా తరలివస్తున్నారు. ప్రాజెక్టు వద్ద పర్యా టకులు తమ సెల్ ఫోన్‌లతో సెల్ఫీలు దిగుతూ తమ ఫోన్‌లలో బందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుపై కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బం దులు పడుతున్నారు. అధికారులు పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని కనీస వసతులు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఉచితంగా మాత్రల పంపిణీ



మందులను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం సభ్యులు

ఆర్మూర్‌టౌన్, జూలై 14 : పట్టణంలోని రాజారాంనగర్, కెనాల్ కట్ట ప్రాంతంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మాత్రలను పంపిణీ చేశారు. రాబోవు సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఉచిత హోమియోపతి డెంగ్యు నివారణ ముందస్తు మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు దివ్యభారతి, హరిష్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, ప్రాజెక్టు చైర్మన్ కొంగి మనోహర్, ద్యాగ ఉదయ్, అంబల్ల తిరుపతి, శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్, గుర్రం విజయానంద్, రమణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డిని కలిసిన చిట్టాపూర్ గ్రామస్థులు



సునీల్‌రెడ్డిని కలిసిన చిట్టాపూర్ గ్రామస్థులు

ముప్కాల్, జూలై14: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి లిఫ్ట్ మం జూరైనా పనులు జరగడం లేదని చిట్టాపూర్ గ్రామస్థులు ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డిని మోర్తాడ్ లోని ప్రజా నిలయంలో కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన సునీల్‌రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే పనులు ప్రారం భించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిట్టాపూర్ వీడీసీ సభ్యులు లింగన్న, రాజారాం, తెడ్డుసాయిలు, సత్యరాజు, రమేష్, సత్యం, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలో బినోల వాసికి బంగారు పతకాలు



స్విమ్మింగ్ పోటీలలో బంగారు పతాకాన్ని అందుకున్న మిట్టాపల్లి రిత్విక

నవీపేట,జూలై14: మండలంలోని బినోలకు చెందిన మిట్టాపల్లి రిత్విక రాష్ట్రస్థాయి స్విమ్మిగ్ పోటీలలో మూడు బంగారు పతాకాలు, రెండు కాంస్య పతాకాలను సాధించింది. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ తెలంగాణ సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్ షిప్-2024 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 13, 14తేదిలలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో నిజామాబాద్ జిల్లా తరపున పాల్గొన్న మిట్టాపల్లి రిత్విక గ్రూప్-1 బాలికల విభాగంలో 50మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతాకం, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతాకం, 200మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతాకంతో పాటు 50మీటర్ల బటర్ ఫ్లైలో కాంస్య పతాకం, 200మీటర్ల ఇండివిజిల్ మిడ్లేలో కాంస్య పతాకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆగస్టు 6నుండి 11వ తేది వరకు ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లోని కలింగ స్టేడియంలో జరిగే 40వ సబ్ జూనియర్ నేషనల్ అక్వెటిక్ చాంపియన్ షిప్-2024, 50వ జూనియర్ నేషనల్ అక్వెటిక్ చాంపియన్ షిప్-2024 జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపికైన మిట్టాపల్లి రిత్వికను తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు జీ.మైపాల్ రెడ్డిలు అభినందించారు.

చిన్నమావంది గ్రామంలో విషాద ఛాయలు

బోధన్‌రూరల్, జూలై14 : బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన శ్రీరాం పద్మ, కూతురు గౌతమికి జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో శ్రీరాం పద్మ అక్కడికక్కడే మృతి చెందడం, గౌతమికి గాయాలయ్యాయి. శ్రీరాం పద్మ మరో కూతురు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా ఆదివారం ఆమెను కలిసేందుకు వెళ్లి వస్తున్న సందర్భంలో కారు ఢీకొనడంతో అక్కడికక్కడే శ్రీరాం పద్మ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే శ్రీరాం పద్మ ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని చిన్న కూతురును చూడడానికి వెళ్లి కారు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



మాక్లూర్ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



గురువులతో 2001-02 పదో తరగతి విద్యార్థులు

● పలు మండలాల్లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు
● ఉపాధ్యాయులకు సన్మానాలు

మాక్లూర్, జూలై 14 : మాక్లూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2002-02 సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల కళాయిక ఆహ్లాద వాతావరణంలో కొనసాగింది. గత 23ఏళ్ల మాక్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాల వెళ్ళిపోయిన వారు ఒక్క చోటికి చేరారు. నాడు విద్యార్థి దశలో చోటు చేసుకున్న సంఘటనలు గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులందరు కలిసి సంతోషంగా కాలక్షేపం చేశారు. పలువురు పూర్వవిద్యార్థుల ఉన్నతని తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో విద్య వ్యవస్థలో ఉన్న పరిస్థితులు నేటి పరిస్థితులను పోల్చుతూ ఉపాధ్యాయులు పలు సందేశాలు చేశారు. మాక్లూర్ ఉన్నత పాఠశాలలో విద్య నభ్యాసించేందుకు కృష్ణనగర్, దుర్గానగర్, గాంధీనగర్, బోంకన్‌పల్లి, ముల్లగి గ్రామాల నుంచి కాలినకడన విద్యార్థులు వచ్చేవారని ఉపా ధ్యాయులు గుర్తు చేశారు. పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుంటూ ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బాగేందర్, భూపతిరెడ్డి, మల్కయ్య, రవీందర్‌గుప్తా, వేణుగోపాల్, గంగారెడ్డి, వెంకటరాజయ్య, పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్నిలో ...

వర్ని,జూలై14: మండల కేంద్రంలో ఆదివారం 2001-02విద్యా సంవత్సరంకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఘనంగా ఆత్మీయ స్వామ్మేళనం నిర్వహించారు. వడ్డేపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించినందుకు ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తమకు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చిన గురువులను సన్మానించారు. తమ గురువుల విద్యతో 53మంది విద్యార్థులలో ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, న్యాయవాదులుగా, వ్యాపార రంగాల్లో స్థిరపడి భవిష్యత్తుకు బాటలు వేసుకున్నామని పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను గురువులతో పంచుకున్నారు. తల్లిదండ్రుల తర్వాత తమకు అంతటి స్థానాన్ని కల్పించిన ఘనత తమ గురువులకే దక్కుతుందని హర్షం వ్యక్తం చేశారు. తమపై ఆధారపడి విద్య నేర్చుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడ్డ విద్యార్థులను గురువులు ప్రశంసించారు. విద్య నేర్పిన గురువులు విజయనందరావు, సత్యనారాయణ, అంజయ్య, రుక్మిణి, గోపాల్, పీఈటీ వెంకటేశ్వార రావులకు పాదాభివందనం చేసి గూపు ఫ్రోటో దిగారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బానోత్ రమేష్, నరేడ్ల బాలు, మొబైల్ శ్రీను, కృష్ణ, డీ.రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్, జూలై 14 : బాల్కొండ మండలం కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2000-01 సంవత్సరానికి చెందిన పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 23ఏళ్ల తర్వాత తోటి మిత్రులతో కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. 23 ఏళ్ళ తర్వాత గురువులు, ఉపాధ్యాయులు ఒక చోట చేరి ఆప్యాయంగా పలకరిం చుకున్నారు. వారి యోగ క్షేమాలు అడిగితె లుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాం తాల్లో వ్యాపారాల్లో, ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ చిన్ననాటి తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను పుష్పనాథ్‌రెడ్డి, లింబాద్రిలను పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సన్మానించారు. గురువులు చెప్పిన విద్యబుద్ధులు నేర్చు కొని జీవితంలో స్థిరపడ్డామని గురువులది గొప్ప స్థానం అని కొనియాడారు.



కిసాన్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో కలిసి పూర్వవిద్యార్థులు

23 ఏళ్ల తర్వాత..

డిచ్‌పల్లి, : వారంత 2001-02 విద్యాసంవత్సరంలో విశ్వశాంతి హైస్కూల్ ఒకే దగ్గర కలిసి చదువుకున్నారు. 23ఏళ్ల అనంతరం ఆదివారం బర్దిపూర్ శివారులో గల క్రిష్ణ హోటల్ లో ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బోధన చెప్పిన గురువులను శాలువలు, బహుమతులతో ఘనంగా సత్కరించారు. 23ఏళ్ల తర్వాత అందరు ఒకే చోటుకు చేరుకోవడంతో సంతోషకర వాతవరణం ఏర్పాడింది. ఒకరినోకరి కుటుంబల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరు కలిసి భోజనలు చేశారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్‌కుమార్

కమ్మర్‌పల్లి, జూలై 14: మండలంలోని వివిద గ్రామాలలో పలుబాదిత కుటుబాలను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కమ్మర్‌పల్లిలో అనారోగ్యంతో భార్యచనిపోయిన అకిల రవి, రోడ్డుప్రమాదంలో భార్య ఆకులు తిరుమల, అనారోగ్యంతో తల్లి మరణించడంతో బషీరాబాద్‌కు చెందిన ఆకులు లింగన్న కుటుంబసభ్యులను, హసాకొత్తూర్ గ్రామానికి చెందిన భూమన్నకు 3లక్షల 70 వేల ఎల్‌వోసిఅందజేయగా గుండెసభందిత శస్త్రచికిత్స(బైపాస్ సర్జరి) అనంతరం మరణించగా ఆయన కుటుంబసభ్యులను, పక్షవాతంలో బాదపడుతున్న అదేగ్రామానికి చెందిన గంగారాంను ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు పాలెపు నర్సయ్య, బుచ్చిమల్లయ్య, అజారోద్దీన్, సింగిరెడ్డి శేఖర్, నల్ల సాయికుమార్, పడిగెల ప్రవీన్ , రేవతి గంగాధర్, మనోహర్, సక్కరం నారాయణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

స్పోర్ట్స్ షూటింగ్‌లో ఆదర్శ కళాశాల విద్యార్థిని ప్రతిభ

● తమిళనాడులో జరుగుతున్న స్పోర్ట్ షూటింగ్‌లో పాల్గొంటున్న సాత్విక

జక్రాన్‌పల్లి, జూలై14: మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాల, కళాశాల బైపీసీ ఇంటర్మీడియేట్ పూర్తి చేసి సుధనవేణి సాత్విక ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి రాష్ట్రాల నుంచి సాత్విక ప్రతినిధ్యం వహిస్తుంది. తమిళనాడులో జరుగుతున్న ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షిప్‌లో ఉమ్మడి రాష్ట్రాల నుంచి నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల గ్రామానికి చెందిన సాత్విక తమిళనాడులో జరుగుతున్న స్పోర్ట్స్ షూటింగ్‌లో పాల్గొంటుందని ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సుమలత శ్రీనివాస్‌గౌడ్ దంపతుల కూతురు సాత్విక ప్రస్తుతం నిజామాబాద్‌లోని మహిళ డిగ్రీ కళాశాలలో బీజెడ్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో చురుకుగా ఉండే సాత్విక భివష్యత్‌లో మరెన్నో క్రీడల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాత్వికను ఆదర్శ కళాశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.



స్పోర్ట్స్ షూటింగ్‌లో పాల్గొన్న సుధనవేణి సాత్విక

ఘనంగా బోనాల పండుగ



బినోలలో బోనాలను ఎత్తుకున్న మహిళలు



నల్ల పోచమ్మ ఆలయానికి బోనాలతో తరలివెళ్లిన భక్తులు



పోతంగల్‌లో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోటగిరి,జూలై14: పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత పోతంగల్, కొత్త పోతంగల్ గ్రామాలలో హనుమాన్ ఆలయాల నుండి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పెద్ద పోచమ్మ తల్లి ఆలయాల వరకు కొనసాగింది. పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీజేలు ఏర్పాటు చేసి చిన్నారులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి దేవతామూర్తులకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్ని శంకర్, పవన్, వీరేశం, విఠల్, గంధపు రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు : రుద్రూరు మండలంలోని అంబం (ఆర్) గ్రామం లో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం ముందుగా ఊరడమ్మ తల్లి ఆలయం వద్ద సర్కారు గొర్రెతో ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాల మధ్య ముదిరాజ్, యాదవ, పెరిక మత్స్యకార, కుర్మ తదితర సం ఘాల నుంచి మహిళలు బోనాలు తీసి మేకలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మ, మైసమ్మ, లక్ష్మమ్మ, నల్ల పోచమ్మ, కట్ట మైసమ్మ, కట్ట రాజులు, ఎల్లమ్మ, మత్తడి పోచమ్మ, గజ్జెలమ్మ తదితర ఆలయాల వద్ద నైవే. ద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రెంజర్ల గంగారాం, కార్యదర్శి రాములు, ఆసం రాము, పట్టేపు రాములు, పోశెట్టి, ఎంజీఆర్, హన్మాండ్లు, కపిల్, మహేష్, సాయిలు, బాలు, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని స్థానిక నల్ల పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత పోతంగల్, కొత్త పోతంగల్ గ్రామాలలో హనుమాన్ ఆలయాల నుండి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పెద్ద పోచమ్మ తల్లి ఆలయాల వరకు కొనసాగింది. పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

డిచ్‌పల్లి,జూలై 14: లయన్స్ క్లబ్ నిజామాబాద్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్ లక్ష్మీ తెలిపారు. మండలంలోని యానంపల్లి శివారులోని ఓ పంక్షన్ హాల్ లో సమావేశామైన ప్రతినిధులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా కైరంకొండ మురళి, కార్యదర్శులుగా గంగారాజు, కోశాధికారి గా రవీందర్ లు ఎన్నికయ్యారు. ఎన్నికైన ఈ నూతన కమిటీని పూర్వ జిల్లా కన్వీనర్ బసవేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పెంటయ్య, గంధాని శ్రీనివాస్, అనిల్ పటేల్, అగర్వాల్, యాదగిరి, తులసిదాస్, లక్ష్మణ్, దర్మరాజు, ప్రవీణ్, పుల్గం హన్మండ్లు, గురుచరణ్ పాల్గొన్నారు.

పోడు రైతుల సంతకాల సేకరణ

వర్ని, జూలై 14 : పోడు భూమిని సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనేతర నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరుతూ పోడు భూముల సాధన కమిటీ నాయకులు చందూర్ బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పోడు భూముల సాధన కమిటీ కన్వీనర్ నన్నేసాబ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి నిరుపేద పోడు రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడు రైతులు సాయిబాబా, వెంకన్న, సాయిలు, శ్రీను, హన్మాండ్లు, సాయి, అబ్బయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

జక్రాన్‌పల్లి, జూలై 14 : మండలంలోని అర్గుల్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ ఆలయంలో నూతనంగా నాగమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇదే ఆలయంలో లంబడవ్వ విగ్రహాన్ని పునః పతిష్టించారు. వీడీసీసభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, వీడీసీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో పోచమ్మకు భక్తుల నైవేద్యాలు

పెర్కిట్, జూలై 14 : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని పోచమ్మ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం కుటుంబ సమేతంగా వచ్చి పోచమ్మతల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా పంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. అలాగే పట్టణంలోని నల్ల నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బోధన్ కోర్టు ఏజీపీగా మాజీ మున్సిపల్ చైర్మన్



ఏజీపీగా నియమితులైన గౌసోద్దీన్‌ను అభినందిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జూలై14: బోధన్ కోర్టు ఏజీపీగా మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసోద్దీన్ న్యాయవాది నియామకం అయిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను అభినందించారు. చట్టపరంగా ప్రజలందరికీ న్యాయం చేకూర్చేలా చూడాలని కోరారు. అనంతరం అతనిని సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రమోద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



సూర్య ఆరోగ్య సంస్థ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్

డిచ్‌పల్లి, జూలై 14 : సూర్య ఆరోగ్య సంస్థ ప్రచురించిన బ్రోచర్‌ను రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆదివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సూర్య ఆరోగ్యసంస్థ నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు, టీబీ, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న పౌష్టికాహార కిట్లు అందించి సేవలు చేయడం అభినంద నీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు, దంత పరీక్షలు, ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాలు తమ సంస్థ ద్వార నిర్వహిస్తునట్లు సంస్థ చైర్మన్ భగవన్, సీవోవో రాజేంద్ర కుమార్ ఛైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వినోద్ కుమార్, నరసింహరావు, ధనుంజయ్, పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన ధర్మారం గురుకుల విద్యార్థినులు

డిచ్‌పల్లి, జూలై 14 : మండలంలోని ధర్మారం (బీ) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థినులు ఐఐటీలలో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.అభినయ(ఐఐటీ, వారణాసి), బీటెక్ ఫార్మాసిటికల్ ఇంజనీరింగ్ లో బి.వర్ష, (హెచ్‌సీయూ), కృతజా(ఐఐటీ దర్వాడ్) లో సీట్లు పొందారని ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సంగీత అభినందించారు.

'కాసుల బాల్‌రాజ్ సభను విజయవంతం చేయాలి'

రుద్రూరు, జూలై 14 : తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం మొట్ట మొదటిసారిగా బాన్సువాడ పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా బైక్ ర్యాలీ, సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు రుద్రూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రుద్రూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న (సోమవారం) కొయ్యగుట్ట నుంచి ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీతో ప్రారంభమై బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో కాసుల బాల్‌రాజ్‌కు ఘన స్వాగతం, సన్మాన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, స్థానిక ఎమ్మెల్యే పోచా రం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన యెండల

రుద్రూరు, జూలై 14 : మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం బాన్సువాడ నియోజకవర్గం బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ పరామర్శించారు. కార్యకర్త జల్ల సాయికిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా రుద్రూరు మండల ఉపాధ్యక్షులు ఎర్రోళ్ళ శంకర్ భార్య రేణుకా మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో కార్యకర్తను పరామర్శించి ఓదార్చారు. అక్బర్‌నగర్‌లో ఇటీవల మృతిచెందిన కాజా సుధాకర్‌రావును కూడా యెండల లక్ష్మీనారాయణ పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో రుద్రూరు మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, బీజేపీ నాయకులు రామ్‌రాజ్ తదితరులు ఉన్నారు.



చిక్కడ్‌పల్లిలో కార్యకర్తను పరామర్శిస్తున్న యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

విద్యకే తలరాతను మార్చే శక్తి ఉంది

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, జూలై 14: విద్యకే మనిషి తలరాతను మార్చే శక్తి ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎస్సెస్సీ, ఇంటర్, ఎంసెట్, నీట్, ఐఐటీలలో ప్రతిభ కనబర్చిన 23మంది ఆర్యవైశ్య విద్యార్థులకు బంగారు పతకాలను అందజేయడం గొప్పవిషయమన్నారు. ఆర్యవైశ్యులలో ప్రతిభావంతమైన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆవోపా వారిని అభినందించారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు జిల్లాకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. చదువుకునే పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. రాష్ట్రంలో జిల్లాకు మంచి పేరు ఉందని విద్యావంతులు, జాతీయ స్థాయి క్రీడాకారులు ఉండటం వల్ల జిల్లాకు గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గుప్త, పోల శ్రీధర్‌గుప్త, శ్రీనివాస్‌గుప్త, కొండవీరశేఖర్ గుప్త, ధన్‌పాల్ శ్రీనివాస్‌గుప్త, గజవాడ గణేష్‌గుప్త, ఆవోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌ఫేర్



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆకుల లలిత

నిజామాబాద్ అర్బన్, జూలై 14: నగరంలోని గంగాస్థాన్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు జాబ్‌ఫేర్‌లో పాల్గొనగా వారితో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మాట్లాడారు. తమ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు జాబ్‌ఫేర్‌ను నిర్వహించడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. జాబ్‌ఫేర్ ద్వారా ఉద్యోగాలకు ఏ విధంగా సిద్ధం కావాలి, ఇంటర్వ్యూలకు ఏ విధంగా సిద్ధం కావాలనే విషయాలను తమ ఫౌండేషన్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

గీతకార్మికులకు రక్షణ కిట్‌లు అందజేయడం అభినందనీయం

ఇందల్వాయి, జూలై 14: గీతకార్మికుల రక్షణ కోసం పాదమయ్యే రక్ష పేరుతో కిట్‌లను అందజేయడం అభినందనీయమని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు నవీన్‌గౌడ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మేట్ లస్కర్‌గూడలో సీఎం రేవంత్‌రెడ్డి గౌడ కులస్తులకు రక్షణ కిట్‌లను అందజేసి వారితో సహపంక్తి భోజనం చేసినట్లు తెలిపారు. చెట్లు ఎక్కి కల్లుగీసే క్రమంలో కార్మికులు ప్రమాదాలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి రక్షణ కిట్‌లను హైదరాబాద్ ఐఐటీతో కలిసి ఓ ప్రైవేటు సంస్థ తయారు చేసిందని గీత కార్మికులు సులువుగా తాటి చెట్లు ఎక్కేలా ఈ కిట్‌లను రూపొందించారని అన్నారు. ప్రమాదవశాత్తు చెట్టుమీద నుంచి కిందపడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారని ఒక్కో కిట్‌లో మొత్తం 6 పరికరాలు ఉంటాయని అన్నారు. వీటన్నింటిని వేరువేరుగా ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్‌ల తరహాలోనే యూజర్ ఫ్రెండ్లీగా ఈ పరికరాలు ఉన్నాయన్నారు. ఎంతో టెక్నాలజీ పురోగమిస్తున్న సగటు గీత కార్మికుడు చెట్టు ఎక్కి దిగే సౌకర్యం అందుబాటులోకి రావడం లేదని ఇన్నేళ్లలో ఎన్ని ప్రయోగాలు జరిగాయో ఏవి సరైన ఆచరణలోకి రాక ఈరోజుకు గీత కార్మికుడు తమ సంప్రదాయ మోకుడుమాత్రమే నమ్ముకున్నాడన్నారు. ప్రమాదం జరిగాక కుటుంబానికి ఎంత పరిహారం ఇచ్చిన ఆ నష్టం తీర్చలేనిదని గీతకార్మికుడికి వైకల్యం సంభవిస్తే ఆ క్షణంతో తన వృత్తిని మానేసి బతుకు దుర్భరణం అవుతుందని దీంతో అత్యాధునిక టెక్నాలజీతో ఈ రక్షణ కిట్‌లు ఉపయోగపడుతాయని అన్నారు. అన్ని పరీక్షలు పూర్తి చేశాక ఈ కిట్‌లను ప్రభుత్వం పంపిణీ చేసిందని ఈ కిట్‌ల ద్వారా గీతకార్మికులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని అన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిజామాబాద్ అర్బన్, జూలై 14: నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. నగరంలోని వినాయక్ నగర్‌లో శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చొరబడిన దొంగలు పది తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. ఇంటి యజమాని వెంకటి తన భార్యతో కలిసి శనివారం సాయంత్రం వేములవాడకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో చోరీకి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఆదివారం ఉదయం పనిమనిషి దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించింది. నాల్గవ టౌన్ ఎస్సై పాండేరావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం

మద్నూర్, జూలై 14: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన వక్త దిగంబర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారతదేశంలో కాషాయ ధ్వజాన్ని గురువుగా భావించి ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో గురుపూజ కార్యక్రమం గురు సమర్పణ కార్యక్రమాన్ని జరుపుకుంటారని గుర్తుచేశారు. భారతదేశంలో సనాతన ధర్మానికి సంబంధించిన గురువులే మానవులకు మార్గదర్శనం చేసి గురుబోధన చేస్తుంటారని, వారి మార్గంలోనే మానవుడు నడిచి జన్మసార్థకం చేసుకుంటారన్నారు. ప్రతివ్యక్తికి గురువు ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ వ్యవస్థ ప్రము ఖ్‌బెజగం సత్యనారాయణ, జుక్కల్ ఖండ కార్యవాహ జూబ్లీ సంజీవ్, గ్రామ పెద్దలు స్వయం సేవకులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని సిద్ధరామేశ్వరగనర్ గ్రామాల్లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరత మాతా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ సాయినాథ్ మాట్లాడుతూ ప్రతి హిందువులో చైతన్యం రావాలని, హిందూ చైతన్యమే సమాజానికి శ్రేయస్కరమని కొనియాడారు. ఇకనుంచి ప్రతిగ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలపాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

గుర్రంపై గ్రామ దేవతల ఊరేగింపు

కామారెడ్డిటౌన్, జూలై 14: వర్షాలు బాగుపడాలని కోరుకుంటూ ఆదివారం కామారెడ్డి పట్టణంలోని లింగాపూర్ వాస్తవ్యులు గ్రామ దేవతలను గుర్రంపై ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలు బాగా పండాలని వర్షాలు పడాలని గ్రామ దేవతలకు కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు షానూరు, ఉపాధ్యక్షుడు మంచాల రమేష్, కార్యదర్శి వడ్లరవి, కోశాధికారి సుక్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాల వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



మెడికల్ కళాశాలలో బోనాల వేడుకలు

నిజామాబాద్ అర్బన్/పెద్దబజార్, జూలై 14: ఆషాఢమాసం రెండో ఆదివారం కావడంతో నగరంలో ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. పలు సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ డివిజన్లలో పెద్ద ఎత్తున బోనాల పండుగను నిర్వహించారు. కోటగల్లి గాండ్ల సంఘం, పద్మశాలి సంఘం, ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా పోచమ్మగల్లిలోని పోచమ్మ ఆలయంలోని పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఆషాఢమాసంలో మహిళలు ఎంతో ఇష్టంగా భక్తిశ్రద్ధలతో బోనాలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పిస్తారు. ఆదివారం సైతం పెద్ద సంఖ్యలో మహిళలు డప్పుల చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగింపుగా నిర్వహించారు. కోటగల్లి కోటమైసమ్మ బోనాలు, గాండ్ల సంఘం నిర్వహించిన బోనాల వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయ పండుగల్లో బోనాల పండుగకు ప్రత్యేకత ఉందన్నారు. ఆషాఢమాసంలో ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో బోనం చేసి అమ్మవారిని కొలవడం ఆనవాయితీగా వస్తుందని ఆయన అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని పూజించడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులు, సిబ్బంది ఆషాఢమాసం సందర్భంగా బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు. పోతరాజు, అమ్మవారి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: ఆషాఢమాసం రెండో ఆదివారం రూరల్ వాసులు ఉత్సాహంగా బోనాల పండుగను నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పెద్ద ఎత్తున బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు బోనాలు నెత్తిమీద పెట్టుకుని ఊరేగింపుగా గ్రామ శివారులోని పోచమ్మ, మైశమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఆషాఢంలో గ్రామీణ మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. మహిళలు డప్పుల చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగింపుగా నిర్వహించారు.

విద్యార్థినులను పరామర్శించిన అదనపు కలెక్టర్



చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూలై 14: నగర శివారులోని దాస్‌నగర్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కస్తూర్బా పాఠశాల విద్యార్థినులను అదనపు కలెక్టర్ అంకిత్ పరామర్శించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ అంకిత్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు ఈశ్వరి, గౌతమిలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈశ్వరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. న్యాయం జరిగేలా చూస్తామని బాధిత కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. అంతకుముందు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం సంఘటన స్థలాన్ని సైతం సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసులకు సూచించారు.



పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారి

రోడ్డు పనుల పరిశీలన

బీర్కూర్, జూలై 14: కామారెడ్డి జిల్లా బీర్కూర్ నుంచి దుర్కి వరకు గల రహదారి తో పాటు బీర్కూర్‌లో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను ఆదివారం ఆర్‌అండ్‌బీ నిజామాబాద్ ఎస్ఈ హన్మంతరావు కిందిస్థా యి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ బీర్కూర్ నుంచి దుర్కి వరకు గల రహదారి ధ్వంసం అయిందని, అక్కడక్కడ గోతులు ఏర్పడ్డాయని అన్నారు. అధికారులు రహదారి పరిశీలించి అంచనా వేసి పంపించాలన్నారు. నిధులు విడుదలైన అనంతరం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బీర్కూర్‌లో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించి పనులకు సంబంధించిన వివరాలను కిందిస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ రవి శంకర్, డీఈ మోహన్, ఏఈలున్నారు.

ఆర్టీసీలో కార్మిక చట్టాలను అమలు చేయాలి

బాన్సువాడ టౌన్, జూలై 14: ఆర్టీసీలో కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ బాన్సువాడ డివిజన్ కార్యదర్శి దోసపల్లి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్టీసీలో సిబ్బంది తక్కువగా ఉండడంతో కార్మికులకు పనిభారం పెరిగిందన్నారు. డబుల్ డ్యూటీలు చేయకుంటే బస్సులు నడిచే పరిస్థితి లేదన్నారు. అధికారులు సైతం కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ యూనియన్లు లేకపోవడం వల్ల అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్, జూలై 14: కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు పాలోజ్యుల శ్రీనివాస్‌శర్మ తెలిపారు. ప్రధానకార్యదర్శిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పురుషోత్తం శర్మ, రాజేశ్వర్ శర్మ, ప్రహలాదరావు, మహిళా అధ్యక్షురాలిగా సునీత, కోశాధికారిగా నవీన్‌శర్మ, జాయింట్ సెక్రటరీగా ఉదయభాను, వెంకటేశ్వర్‌రావు, వెంకట రమణరావు, సలహా దారులు కిషన్‌రావు, అర్జున్‌రావు, కాశీనాథ్‌రావు, ఈసీ మెంబర్‌లుగా శ్రీధర్ జోషి, చక్రధర్ కులకర్ణి, శ్రీధర్‌రావు కులకర్ణిలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. బ్రాహ్మణ సభ్యులంతా ఐక్యమత్యంతో ఉండాలని బ్రాహ్మణ సమస్యలు అందరం కలిసి సమష్టిగా పరిష్కరించుకునేందుకు అందరం కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల బ్రాహ్మణులు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

కామారెడ్డి టౌన్, జూలై 14: గిరిజన పోడు రైతులతో పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు అన్నారు. ఆదివారం మాచారెడ్డి మండలం ఎల్లంపేట నడిపితండాలో మాట్లాడుతూ తాతల కాలం నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతులపై ఫారెస్ట్ అధికారులు, పోలీసులు జులుం ప్రదర్శించడం తగదన్నారు. పోలీసు బలగాలతో ఇంటింటికి తిరిగి రైతులను వేధించడం మానుకోవాలని తెలిపారు. రైతులపై జులుం చేసిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇది ప్రజాపరిపాలనని, ప్రజాస్వామ్య బద్ధంగా నడుస్తుందని చెప్పినప్పటికి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే ప్రజలపై ఫారెస్ట్, పోలీసు సిబ్బంది దాడులు చేయడం విడ్డురంగా ఉందన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

ముదిరాజ్‌లను బీసీ ఏలో మార్చాలని వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఎల్లారెడ్డి, జూలై 14: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు బట్టువిఠల్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్ ఆదేశాల మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించామని ఆయన అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేయాలని ఆయన అన్నారు. ఈనెల 15 నుంచి 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పించాలని తెలిపారు. జీవో నెం బర్-6 ప్రకారం చెరువుకుంటల మత్స్యసంపదపై ముదిరాజ్‌ల బెస్తగంగపుత్ర, గూండ్లకులాలకు మాత్రమే హక్కులు ఉండే విధంగా చట్టపరమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, జక్కుల సంతోష్, ప్యాలాల రాములు, మర్రి బాలకృష్ణన్, ప్రకాష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తాటిపల్లి గ్రామంలో కప్పతల్లి ఆడుతున్న యువకులు

వానల కోసం 'కప్పతల్లి' ఆట

సిరికొండ, జూన్ 14: జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురువాలని యువకులు కప్పతల్లి ఆట ఆడారు. వర్షాకాలం ప్రారంభమై నెల పదిహేను రోజులు కావస్తున్నా నేటికీ భారీ వర్షాలు కురువక పోవడంతో గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. మండలంలోని తాటిపల్లి, తూంపల్లి గ్రామాల్లో యువకులు కప్పతల్లి ఆట ఆడారు. వానలు కురిపించాలని మొక్కుకున్నారు. కట్టెకు కప్పను కట్టి ఇద్దరు యువకులు భుజాన వేసుకుని మోస్తూ ఇంటింటికి తిరిగి.. వర్షాలు కురిపించాలి అంటూ నినాదాలు చేస్తూ పాటలు పాడారు. దీంతో ఇంటికి వచ్చిన కప్పతల్లికి బిందెలతో నీళ్లు పోశారు. కాగా, అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు.

వీడీసీ చైర్మన్‌గా మహేందర్



కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

ధర్పల్లి, జూలై 14: ధర్పల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఇంజపురం మహేందర్ ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పోటీ పడగా ఇంజపురం మహేందర్‌కు మెజార్టీ ఓట్లు రావడంతో ఆయన ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా గడ్డం అశోక్, ప్రధాన కార్యదర్శిగా రెబ్బ శ్రావణ్‌కుమార్, ఉపకార్యదర్శిగా చిన్నబాబన్న, కోశాధికారిగా మిట్టపల్లి ప్రభాకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా చెలిమెల నడ్పి బాలయ్య, జనార్ధన్, పోశెట్టి, గంగరాజం, ప్రవీణ్, అమీరుద్దీన్‌లు ఎన్నిక కాగా కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వర్, విశాల్, గంగాధర్, సంతోష్, నరేష్, రాకేష్, మహిపాల్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గం ఏడాదిపాటు కొనసాగనుంది. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ తెలిపింది. ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

'ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం ఐఆర్‌ను 20 శాతానికి పెంచాలి'



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

పెద్దబజార్, జూలై 14: గత ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం ఐఆర్‌ను 20 శాతానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెంచాలని తెలంగాణ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల పెన్షనర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏ, డీఆర్‌లను వెంటనే ప్రకటించాలని 5వ డీఏ, డీఆర్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే అది కూడా ప్రకటించాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో గరిష్ఠ పరిమితి లేని నాణ్యమైన ఉచిత వైద్య చికిత్సలు అందించాలన్నారు. ప్రతి జిల్లాలో రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేస్తూ నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. పీఆర్‌సీ రిపోర్టును వెంటనే తెప్పించుకొని జూలై 1, 2023 నుంచి మానిటరి బెనిఫిట్స్ చెల్లిస్తూ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఈనెల 15న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, ప్రసాద్‌రావు, రాధాకిషన్, ఈవీఎల్ నారాయణ, భోజారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

బాన్సువాడటౌన్, జూలై 14: జిల్లాలోని అన్ని మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, ఖాళీ స్థానాలను భర్తీ చేయాలని, బదిలీలు, పదోన్నతులలో సాంకేతిక లోపంతో నష్టపోయిన సీనియర్ ఉపాధ్యాయులకు మరోసారి అవకాశమివ్వాలని కోరారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.120	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	: రూ.125	రూ.235	రూ. 255

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,600	రూ.67,800	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
: కల్కి(హిందీ) (2.45, 10.15)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (11.15, 3.00, 6.45, 10.30)
స్క్రీన్-3 : కిల్ (హిందీ) (12.15, 2.45, 9.00)
: భారతీయుడు-2 (5.15)
స్క్రీన్-4 : సర్ఫిరా (హిందీ) (12.20, 3.40, 7.00, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భారతీయుడు-2 (9.00, 12.30, 4.00, 7.25, 10.50)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (10.00)
: కల్కి(తెలుగు) (1.30, 3.20)
: కల్కి(3డి తెలుగు) (6.45)
స్క్రీన్-3 : కల్కి(తెలుగు) (10.30, 1.30, 3.20, 7.00, 10.40)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్